## జోరుగా బడిబాట..

**షాబాద్, మే 17, ప్రభాతవార్త:**

షాబాద్ మండలం ఎల్గొండగూడా గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, 25 మంది ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి డి.లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. పాఠశాల దాత విద్యాభిమాని రవీందర్‌రెడ్డి తన స్వంత ఖర్చులతో పాఠశాల ప్రహరీగోడ గేటు నిర్మాణ పనులను చేయించడం సంతోషకరమన్నారు. గ్రామంలో నుండి మొత్తం 40 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెలుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు చెప్పడంతో 25 మంది విద్యార్థులను పాఠశాలలో అడ్మిషన్ తీడుకున్నారు. కాబట్టి మిగిలిన 15మంది విద్యార్థులను మన పాఠశాలలో అడ్మిషన్ చేయ్యాలన్నారు. ఎల్గొండగూడా పాఠశాల అభివృద్ధి కొరకు పరితపిస్తున్న గ్రామస్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు రవీందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, యాదయ్య, బలరాం, శ్రీనివాస్‌చారీ, మల్లారెడ్డి, సతీష్, రవి, శేఖర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**-ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.దత్తునాయక్**

**మహేశ్వరం, మే 17 ప్రభాతవార్త:**

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 29కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.దత్తునాయక్ డిమాండ్ చేశారు. కార్మిక సమస్యల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్లను తుక్కుగూడ పట్టణంలో పోస్టర్ విడుదల చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి.దత్తునాయక్ ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లోకి మార్చి కార్మికులకు హక్కులు లేకుండా చేయడాన్ని నిరసిస్తూ మే 20న సార్వత్రిక సమ్మెను అఖిలభారత కార్మికసంఘాలు, ఫెడరేషన్‌లు నిర్వహిస్తున్న నేపథ్యంలో సమ్మెలో కార్మికులు విస్తృతంగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఘనంగా బొడ్రాయి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన

**-పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే**
**-నేడు పండుగ, బోనాల సమర్పణ**



బొడ్రాయి యంత్ర ప్రతిష్ఠలో పాల్గొన్న ఎంపి రాజేందర్

**ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్‌లో శనివారం నాభిశిల బొడ్రాయి ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. బొడ్రాయి ఉత్సవ కమిటీ ఆధ్వర్య ంలో గత మూడురోజులుగా ప్రతిష్ఠాపనకు పూజలు చేస్తున్నారు. శనివారం అర్చకుల మంత్రోచ్చరణాల మధ్య మంటపారాధన, మూలవిగ్రహ పంచామృత అభిషేకం, యంత్రప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠ సందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు, పార్టీల నాయకులు, యువజనసంఘాల సభ్యులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ జడ్పిటిసిలు నక్క ప్రభాకర్‌గౌడ్, మంద సంజీవరెడ్డిలు పాల్గొని బొడ్రాయికి పూజలు చేయగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వారికి శాలువాలు కప్పి సన్మానించారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. నాయకులకు బొడ్రాయి పండుగ సందర్భంగా పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి సా ్వగతం పలికారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్లు ముల్లి పావని జంగయ్యయాదవ్, బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మాజీ ఎంపిపిలు బండారి దాసుగౌడ్, బండారి శ్రీనివాస్‌గౌడ్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్, బిజెపి అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, సొసైటీ డైరక్టర్ రేసు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు అబ్బసాని యాదగిరియాదవ్, మెడబొయిన వెంకటేశ్, వరిగంటి వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, మంకం రవి, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాజబోయిన యాదగిరియాదవ్, మాజీ కౌన్సిలర్లు బండారి అంజనేయులు, కొమ్మిడి అనురాధ, కడుపోల్ల మల్లేశ్, బండారి వసంత, బేతాల నర్సింగ్‌రావు, మాజీ కోఆప్షన్ సభ్యురాలు పల్లె అరుణ, సొసైటీ మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, గౌడసంఘం అధ్యక్షులు మదనగిరి సురేశ్‌గౌడ్, మాజీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, గడ్డిఅన్నార ం ఎఎంసి మాజీ డైరక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి, కీసరగుట్ట మాజీ డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు పసుపు నూరి చంద్రశేఖర్‌గుప్త, మాజీ అధ్యక్షులు బచ్చు మారయ్యగుప్త, ప్రమోద్‌గుప్త, బచ్చు నగేశ్‌గుప్త, నాయకులు బొమ్మక్ శ్రీనివాస్, ఉల్లి అంజనేయులు, బర్ల రాధాకృష్ణ, సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల సత్యనారాయణ, గ్యార బాలయ్య, బర్ల కిష్టయ్య, కొరుబొతు నాగరాజు, బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, బొక్క సత్తిరెడ్డి, బొక్క సంజీవరెడ్డి, కార్తీక్‌యాదవ్, పల్లె విజయ్‌గౌడ్, రామతీర్థగౌడ్, నరేశ్‌ముదిరాజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హాపీ...హాపీ...బర్త్‌డే యాదన్న

**-చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు సిఎం రేవంత్‌రెడ్డి దీవెన**

**చేవెళ్ల, మే 17, ప్రభాతవార్త:**

హాపీ...హాపీ..బర్‌డే టు యు యాదన్న అంటూ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్‌రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను దీవించారు. శుక్రవారం రాత్రి పదిగంటలకు సిఎం రెవంత్‌రెడ్డి నివాసంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కలిసారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనముల రెవంత్‌రెడ్డి మాట్లాడుతూ మునుముందు ఇంకా ఇలాంటి పుట్టిన రోజులు మరిన్ని జరుపుకోవాలని, పెద్ద ఎత్తున జనం నీరాజనాలు పలకడం నీవు ప్రజల కోసం చేస్తున్న పనులేనని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు సూచించారు. జనంలో ఉంటూ జనం కోసం తిరుగుతున్న నేతల్లో మొదటి స్థానంలో నిలిచావని, ఇలాగే కంటిన్యూగా నియోజకర్గంలో పర్యటించి, అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య జనం కోసం జనంలోంచి పుట్టిన నేతగా చరిత్రలో నిలిచిపోతారని సిఎం రేవంత్‌రెడ్డి కితాబిచ్చారు.



కాలే యాదయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

## యువత నైపుణ్యాభివృద్ధి సాధించాలి

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**- మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సేవలు ప్రశంసనీయం**




శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్ రూరల్, మే 17, ప్రభాతవార్త:**

షాద్‌నగర్ నియోజకవర్గంలోని యువత నైపుణ్యాభివృద్ధి సాధించి ఉద్యోగాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. శనివారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో డేటా సైన్స్ శిక్షణ పూర్తి చేసిన యువతీయువకుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... నైపుణ్యాభివృద్ధితో యువత జీవితాలలో మార్పు వస్తుందని, ఉద్యోగ అవకాశాలు పొంది మెరుగైన స్థితిలో ఉంటారని అన్నారు. డేటా సైన్స్ శిక్షణల వంటి నిర్ణయాత్మకమైన శిక్షణ పూర్తి చేసుకున్న యువత ఆత్మనిర్భరులు, ఉద్యోగార్థులు కావడానికి అవసరమైన నైపుణ్యాలు పొందుతున్నారన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా యువతకు శిక్షణ ఇస్తున్న మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సేవలు ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. అదేవిధంగా యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సిఈఓ రేఖ మాట్లాడుతూ... వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రామీణ ప్రాంతాలను మేము పరివర్తనలో ఉన్న సముదాయాలుగా పరిగణిస్తామని, ఇలాంటి సముదాయాలకు సాధారణంగా వారి చుట్టూ జరుగుతున్న మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన మద్దతు లభించదని, అందుకే ఈ మారుతున్న సమాజంలో యువతకు సాంకేతికత, జీవిత నైపుణ్యాలను అందించడానికి ముందుకు వచ్చామని, ఈ శిక్షణతో వారు కొత్త సాంకేతిక యుగంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో మైక్రోసాఫ్ట్ కమ్యూనిటీ ఆఫైర్స్ లీడ్ శ్రీచందన, మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, సీనియర్ నేతలు రఘు, అగ్గనూరు విశ్వం, ప్రవీణ్, రాయికల్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 17, ప్రభాతవార్త:**

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశమందిరంలో వానాకాలపంటల సంసిద్ధత సమావేశం జరిగింది. ఈసందర్భంగా విత్తనాలు, ఎరువుల సరఫరా, లభ్యత, టాస్క్‌ఫోర్స్, అంతర్గత బృందాలు, నకిలీవిత్తనాల నిరోధం, నాణ్యత ప్రమాణాలపై వ్యవసాయశాఖ, పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల నుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నకిలీవిత్తనాలు, ఎరువులు విక్రయించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నకిలీ విత్తనాలు అరికట్టడంలో ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా తమవిధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాసరిహద్దుల్లో కూడా టాస్క్‌ఫోర్స్ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి వేలకోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని దీనికి అనుగుణంగా వ్యవసాయ రంగం వృద్ధిలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న 538 ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలు ఎప్పటికపుడు అధికారులు తనిఖీలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. విత్తనాల నాణ్యతను పరిశీలించాలని ఆయన తెలిపారు.

జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ, నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై పిడి చట్టము ప్రయోగించి చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు పంటలు కోల్పోవడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని, రైతులను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన తెలిపారు. నకిలీ విత్తనాలు ఎక్కడైనా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లయితే వారిపై వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, డిహెచ్ఎస్ఓ సత్తార్, వ్యవసాయ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

## సంక్షేమ పథకాల ఎంపికలో కృత్రిమ మేధస్సు

**-ఇందిరమ్మ ఇళ్ల అర్హత జాబితా పారదర్శకం**



నమూనా ఇల్లు

**యాచారం మే 17 ప్రభాతవార్త:**

రాబోవు రోజుల్లో మనిషి చేయాల్సిన పనులన్ని కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ) చేయబోతుందని తెలుస్తుంది. రాబోవు రోజుల్లో మనిషి చేయాల్సిన పనులన్నీ కృత్రిమ మేధస్సు చేస్తూ పని సమయం ఖర్చు అన్నీ తగ్గిస్తుందని భవిష్యత్తు తరాల వారికి సాంకేతికంగా పనులన్నీ సర్వసాధారణంగా జరుగుతాయని విశ్లేషకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాల విషయం తీసుకుంటే కృత్రిమ మేధస్సు ద్వారా లబ్దిదారుల ఎంపిక జరిగి వారి ప్రక్రియలో పూర్తిగా కృత్రిమ మేధస్సు నుండి పనులు జరుగుతాయని అందులో ఎలాంటి అవకతవకలు జరగవని పూర్తిగా కంప్యూటర్ ద్వారానే పనులు జరిగిపోతాయని అధికారులు చెప్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు విషయానికి వస్తే గతంలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో ఏదైతే ఫోన్ ద్వారా స్థలాన్ని పరిశీలించి ఫోటోలను అప్లోడ్ చేశారు. భవిష్యత్తులో అదే అప్లోడ్ చేసిన నిర్ణీత స్థలం లోనే ఇల్లు నిర్మాణం జరగాలని కచ్చితంగా నిబంధనలు ఉన్నాయని కృత్రిమ మేధస్సు అలాంటిదే పరిగణలోకి తీసుకుంటుందని తెలుస్తుంది. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఇల్లు నిర్మాణంలో 600 చదరపు గజాల ఇంటి నిర్మాణంలో ఉన్న వారికే అర్హత ఉంటుందని, అంతకుమించి ఒక చదరపు గజం ఎక్కువగా ఉన్న, నిర్మాణం చేపట్టిన ఉన్న కృత్రిమ మేధస్సు అంగీకరించదని అర్హత కోల్పోవచ్చు అని తెలుస్తుంది. గతంలో పరిశీలన సమయంలో కంప్యూటర్ ద్వారా అప్లోడ్ చేసిన ఫోటోలు సమాచారం ప్రకారమే కృత్రిమ మేధస్సు లబ్దిదారు ఎంపికలో అర్హతను, అర్హత కోల్పోయే పరిస్థితులను నెలకొంటుందని అంటున్నారు. ప్రలోభాలకు పోకుండా అర్హులైన వారికే ఇందిరమ్మ ఇల్లు వచ్చే అవకాశం ఉందని అందులో ఎలాంటి సందేహం లేదని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత ఉంటుందని ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా అధికారులు ప్రభుత్వం సమష్టిగా సంయమనంతో పనిచేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అర్హులైన నిరుపేదలకే సంక్షేమ పథకం వర్తిస్తుందని అందులో రాజకీయం చేయటానికి ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్తున్నారు. చేపట్టిన సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపికలలో పారదర్శకత ఉంటుందని ఎవరూ ఏమీ చేయలేరని అందులో ఎవరి ప్రమేయం ఉండబోదని అర్హులైన లబ్దిదారులు మాత్రమే సంక్షేమం పొందుతారని ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత




పోలీసుల అదుపులో ఉన్న ఇసుక ట్రాక్టర్

**జిల్లెడు చౌదరిగూడ, మే, 17,(ప్రభాతవార్త):**

అక్రమంగ తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను జిల్లెడు చౌదరిగూడ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గాలిగూడ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా తయారు చేస్తున్న ఇసుక ఫిల్టర్‌లపై దాడులు చేశారు. అలాగ అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమాని దివిటి శ్రీను. ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

**షాద్‌నగర్ రూరల్, మే 17, (ప్రభాత వార్త) :**

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంట తండా సమీపంలో చోటు చేసుకుంది. మృతిచెందిన వ్యక్తి సుమారు 3రోజుల క్రితం మరణించి ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తండా సమీపంలో దుర్వాసన రావడంతో తండా వాసులు గమనించి పోలీసులకు సమాచారం అందజేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వా సుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. మహబూబ్‌నగర్ స్టేషన్ మాస్టర్ విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్, బ్లాక్ కలర్ టీషర్టు ధరించాడని, మృతుని వివరాలు తెలిస్తే షాద్‌నగర్ రైల్వే పోలీసులను సంప్రతించాలని వారు సూచించారు.

## వర్షాల దృష్ట్యా వడ్లను వెంటనే కొనుగోలు చేయండి

**-ధాన్యం కొనుగోలుకేంద్రం ఎంపి పరిశీలన**
**-రైతులను ప్రభుత్వం కష్టాలపాలు చేయకూడదు**

**ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త:**

వరి సేకరణలో జాప్యంపై మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వరిపంటను కోసి నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడంలో అధికారులు ఆలస్యం చేస్తున్నారని రైతులు ఎంపితో వాపోయారు. ధాన్యం ఎండబెట్టి తూర్పార బట్టినప్పటికీ సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గన్నీసంచులు లేవని, కూలీల కొరత ఉందని, బస్తాలో తాలు శాతం ఎక్కువగా ఉందని అధికారులు జాప్యం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ధాన్యం కేంద్రంలో వర్షాలకు వడ్లు తడిసి మొలకలు వచ్చాయని మహిళా రైతులు ఆందోళన వ్యక్తం చేయగా ఎంపి పరిశీలించి ఓదార్చారు. దీంతో ఎంపి రాజేందర్ అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడి రెండు రోజుల్లో ధాన్యం సేకరణ చేపట్టాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి చేరుకొని తడిసిన వడ్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. నాయబ్ తహసీల్దార్ రాజేందర్, ఏఈఓ జగదీష్, సెంటర్ ఇంచార్జ్‌లతో ఆమె మాట్లాడి సమస్యపై సమీక్ష జరిపారు. ఎంపి వెంట బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎర్రోళ్ల మురళీ తదితరులు ఉన్నారు.



తడిసిన వడ్లను పరిశీలిస్తున్న ఎంపి రాజేందర్

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త:**

మోటార్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లో కందకట్ల దయాకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహామోటార్స్ మల్టీబ్రాండ్ కార్ సర్వీస్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పూజలో పాల్గొనగా నిర్వహకులు సన్మానించి మిఠాయి తినిపించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మంద సంజీవరెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచులు దొంకెన బిక్షపతిగౌడ్, పెద్దోళ్ల రమేశ్, వరిగంటి వెంకటేశ్‌గౌడ్, వంగూరి శివశంకర్, మాజీ ఉపసర్పంచ్ ఎలసాని అయిలయ్యయాదవ్, మాజీ వార్డుసభ్యులు బొడిగె శ్రీనివాస్‌గౌడ్, వీరేశ ం, నాయకులు బద్దం జగన్మోహన్‌రెడ్డి, పులెంధర్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

**-పట్టించుకోని అధికారులు**



వృథాగా పోతున్న మిషన్ భగిరథ నీరు

**పెద్దేముల్, మే 17, ప్రభాతవార్త:**

మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నా పట్టించుకునేనాథుడే లేరని పలువురు మండిపడుతున్నారు. పెద్దేముల్ మండలం జనగాంగ్రామ సమీపంలో గత రెండు రోజులుగా పైపులైను లీకేజీ అయి నీరంతా రోడ్డు గుండా పారుతున్నా అడిగే నాథుడేలేకుండా పోయారని పలువురు వాపోతున్నారు. ఒక వైపు రెండు, మూడు రోజులకోసారి మిషన్ భగీరథ నీరు రావడంతో తాగునీటికి ప్రజలు అరిగోస పడుతున్నారు. మరో వైపు నీరు బయటకు వస్తూ లీకవుతున్నా చూసేవారే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైను లీకేజీ కావడంతో నీరంతా వృథాగా పోవడం వల్ల గ్రామాలకు సక్రమంగా నీరు సరఫరాకాక ఆయా గ్రామ ప్రజలు నీటికోసం అల్లాడుతున్నారు. గ్రామాలలో బోరుబావులు, చేతిపంపులు లేక మిషన్ భగీరథ నీటిపై ఆధారపడి ఉన్నారు. అట్టి మిషన్ భగీరథ నీరు మూడు, నాలుగు రోజుల కోసారి రావడంతో తాగునీటి కోసం పగటిపూటనే చుక్కలు చూడవలసివస్తుందని పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా సంబందిత అధికారుల జాడ తెలియడంలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి లీకేజి అవుతున్న మిషన్ భగీరథ పైపులైనుకు మరమ్మతులు చేపట్టి గ్రామాలకు సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన



అవుషాపూర్‌లో బస్టాప్‌కు భూమిపూజ చేస్తున్న నాయకులు

**ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లో శనివారం బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామ బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు కొట్టి శ్రీకాంత్‌రెడ్డి తన సొంత డబ్బులు వెచ్చించి బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డు పక్కన నాయకులు కొబ్బరికాయలు కొట్టి బస్టాండ్‌కు భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ దొంకెన బిక్షపతిగౌడ్, బిఆర్ఎస్‌పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎలసాని అయిలయ్యయాదవ్, మాజీ వార్డుసభ్యులు బొడిగె శ్రీనివాస్‌గౌడ్, కొలిచెలిమి వీరేశం, నాయకులు ముద్దం లక్ష్మణ్‌యాదవ్, దొంకెన మధుగౌడ్, కవాడి పులెందర్‌రెడ్డి, నాగరాజుచారీ, నవీన్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, భానుయాదవ్, వేణు, ప్రభు, చిన్నయాదవ్, కరీం, నికిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

## రియోం యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

**మునిపల్లి, మే 17(ప్రభాతవార్త):** మునిపల్లిమండలం హైద్లాపూర్ శివారు లోగల రియోం ఇండస్ట్రీస్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం జిల్లా లేబర్ అధికారి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేస్తున్న వలస కార్మికులకు మూడు నెలల నుంచి పెండింగ్‌లో వున్న జీతాలను తక్షణమే అందజేయాలని, వారిని వెంటనే డ్యూటీలోకి తీసుకోవాలని, వేదింపులు ఆపాలని డిమాండ్ చేశారు. జీతాలు అడిగినందుకు విధులకు రావద్దనడం దుర్మార్గం అన్నారు. జీతాలు ఇవ్వనందున కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించకుండా నిలువు దోపిడీ చేస్తున్నారని చెప్పారు. లేబర్ అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించి వారిని విధుల్లోకి తీసుకావాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకులు రమేష్‌గౌడ్, కార్మికులు పాల్గొన్నారు.

## అందరికీ ఆదర్శప్రాయుడు అంబేద్కర్

### -బెల్గాం పీఠాధిపతి నిజగుణానంద స్వామి



మాట్లాడుతున్న బెల్గాం పీఠాధిపతి నిజగుణనంద స్వామి

**నాగల్‌గిద్ద, మే 17, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగనిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని బెల్లాం పీఠాధిపతి నిజగుణానంద స్వామి అన్నారు. శనివారం నాగల్‌గిద్దలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. కార్యక్రమంలో మహారాష్ట్రలోని పందరిపూర్‌కు చెందిన అంబదాస్ మహారాజ్, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బిపు మచ్చందర్, డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జి తహసీల్దార్ శివకృష్ణ, ఎంపిడిఓ మహేవ్వరరావు, అంబేద్కర్ ఉత్సవ కమిటి సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలు ముద్దు

### -హద్నూర్ బడిబాటలో ఉపాధ్యాయులు



హద్నూర్‌లో బడిబాటలో బడిఈడు చిన్నారులతో ఉపాధ్యాయులు

**న్యాల్‌కల్, మే 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో శనివారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని బడిఈడు చిన్నారుల ఇళ్లకు చేరుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శివరాజ్, యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాడంతోపాటు పుస్తకాలు, ఏకరూప డ్రస్సులు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. డబ్బులు చెల్లించి ప్రైవేటు పాఠశాలకు విద్యను అందుకోవడం కంటే ఉచితంగా విద్యాను అందించే ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య : ఎంఇవో



మాలాపహాడ్‌లో బడిబాట కార్యక్రమం దృశ్యం

**సదాశివపేట, మే 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మాలాపహాడ్ గ్రామంలో శనివారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన 5వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థుల ఇళ్లకు చేరుకుని ఆత్మకూర్‌లోని ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎన్.శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాడంతోపాటు పుస్తకాలు, 2 జతల ఏకరూప డ్రెస్సులు, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తున్నట్లు గుర్తు చేశారు. పాఠశాలలో కంప్యూటర్ విద్యను అందిస్తున్నట్లు, ఆర్‌ఓటి వాటర్ ఫిల్టర్ ద్వార మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంంలో ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తాజుద్దీన్, సందీప్‌కుమార్, శ్రీనివాస్‌రావు, నరేందర్ రాజు, గోపాల్, మాలాపహాడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విజయరావు, పిఈటి శంకర్, హజారుద్దీన్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బొడ్మట్‌పల్లిలో హోరాహోరీగా సాగిన కుస్తీ పోటీలు

**టేక్మాల్, మే 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా శనివారం కుస్తీపోటీలను నిర్వహించారు. బ్రహ్మోత్స వాల్లోనభాగంగా వీరభద్రాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుస్తీపోటీల్లోననారాయణఖైడ్, బీదర్, పీట్లం, మహారాష్ట్ర నుంచి పాల్గొనేందుకు మల్లయోదులు తరలివచ్చారు. కొబ్బరికాయ కుస్తీ పోటీ నుంచి ఐదు తులాల కడెం పోటీ వరకు మల్లయోధులు తలపడ్డారు. కడెం పోటీలో ఉద్గిర్‌కు చెందిన యదవ్ గెలుపొందారు. ఆ మల్లయోదునికి 5 తులలా వెండి కండెను బహుకరించారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మెన్ బస్వరాజ్, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.



గెలుపొందిన మల్లయోధునికి వెండి కడెంను అందజేస్తున్న దృశ్యం

# సాధారణ జ్వరాలే..చికున్‌గున్యా వ్యాధి లేదు

### డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ గాయత్రిదేవి



రూప్ల తండాలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఓ గాయత్రి దేవి

**సిర్గాపూర్, మే 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రూప్లతండాలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రిదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా గాయత్రిదేవి మాట్లాడుతూ తండాను పరిశీలించామని, ప్రజలు సాధారణ జ్వరాలతో అవస్థలు పడుతున్నారని, చికున్ గున్యా వ్యాధి కాదని, తండావాసులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తండాలోని ప్రజలు జ్వారాల నుంచి కోలుకునేంత వరకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. చికెన్‌గున్యా, డెంగ్యూలాంటి వ్యాధులు తండా వాసులకు సోకలేదని వివరించారు. తండా వాసుల రక్తనమూనాలను, తండాలో నీటిని ల్యాబ్‌లకు పంపినట్లు గాయత్రిదేవి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎం ఆండ్ హెచ్‌ఓ డాక్టర్ సంధ్యారాణి, పిఎచ్‌సి డాక్టర్ నాగమణి, వైద్య సిబ్బంది ఉన్నారు.

**శాంపిల్స్ అన్నీ నెగిటివ్...**

తండాలోని ప్రజల నుంచి సేకరించిన రక్త శాంపిల్స్ అన్ని నెగిటివ్‌గా వచ్చినట్లు పిహెచ్‌సి డాక్టర్ నాగమణి పేర్కొన్నారు. తండా ప్రజలు సాధారణ జ్వారాలు అవస్థలు పడుతున్నారని, జ్వారాలు తగ్గే వరకు తండాలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**కల్హేర్ పిహెచ్‌సిలో ర్యాలీ...**

మండల కేంద్రమైన కల్హేర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ హైపర్‌టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ మాట్లాడుతూ ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, ఒత్తిడిని దూరంగా పెట్టాలన్నారు. రక్తపోటు అదుపులో ఉంచుకోవాలన్నారు. రోజుకోసారైనా రక్తపోటును కొలవాలన్నారు. ప్రతి ఒక్కరు డాక్టర్ల సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి హెల్త్ సూపర్‌వైజర్, ఫార్మాసిస్టు, ఎంఎల్‌హెచ్‌పి, రేడియాలిజి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కేతకి ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## కేతకి ఆలయంలో హుండీ లెక్కింపు

### -75 రోజులకు రూ. 29 లక్షల ఆదాయం

**ఝరాసంగం, మే 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పార్వతీదేవి సమేతంగా కొలువుండి దక్షిణ కాశీగా భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీ కేతకి సంగమేశ్వరుడి ఆలయ హుండీని శనివారం కామారెడ్డి జిల్లా రాజ రాజేశ్వర సేవ సమితి, జహీరాబాద్ శ్రీ భ్రమరాంబిక సేవ సమితి బాధ్యులు లెక్కించారు. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి (75 రోజులుగా) చేరుకున్న దైవదర్శనం చేసుకుని తమ మొక్కుబడిలో బాగంగా భక్తులు 29లక్షల 19వేల 554 రూపాయలను సమర్పించుకున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మి, ఆలయ ఇఒ వివరుద్రప్ప, ఆలయ ధర్మకర్తలు నవాజ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా రాజరాజేవ్వర సేవ సమితి, జహీరాబాద్ శ్రీ భ్రమరాంబిక సేవ సమితి బాధ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## ప్రతి కాలనీకి రక్షిత మంచినీరు : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, మే 17, ప్రభాతవార్త:** నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు రక్షిత మంచి నీరు అందించేందుకు కృషిచేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలోగల అపార్ట్‌మెంట్‌వాసుల కోసం రూ. 20 లక్షలతో చేపట్టనున్న పైపు లైన్ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి మంచినీరు అందించాలని లక్ష్యంతో నూతన రిజర్వాయర్లు, పంపు హౌస్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని.. వాటిలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, కృషి డిఫెన్స్ కాలనీ అధ్యక్షులు అమరేందర్, ప్రధాన కార్యదర్శి మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

**చిన్నశంకరంపేట, మే 17, ప్రభాతవార్త:** మండల పరిధి అంబాజీపేటలో శనివారం రేణుకా ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గణపతి హోమం, పుణ్యావచనం వంటి కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మద్య నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**మర్కుక్, మే 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కర్కపట్ల 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 18వ తేదీ ఆదివారం మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి ఫీడర్, 33కెవి ఫీడర్‌ల నుండి విద్యుత్ సరఫరా అయ్యే కర్కపట్ల గ్రామంతోపాటు ఇండస్ట్రియల్ కంపెనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## కల్హేర్‌లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం

**నారాయణఖేడ్, మే 17 ప్రభాతవార్త :** ప్రపంచ రక్తాపోటు దినోత్సవాన్ని కల్హేర్ పిహెచ్‌సి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. డాక్టర్ జీభాషహీని అధ్యక్షతన ర్యాలీ కొనసాగింది. ప్రతి మనిషి ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ జీభాషహీని అన్నారు. ఈ ర్యాలీలో సూపర్‌వైజర్ మాణిక్యం, ఫార్మసిస్ట్ పాండు. శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**గజ్వేల్, మే 17(ప్రభాతవార్త):** మెరుగైన వైద్యంకోసం ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే పేదలు సిఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో 47 మంది లబ్దిదారు లకు మంజూరైన సిఎం సహాయనిధి చెక్కులను శనివారం క్యాంపు కార్యాల యంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్‌కు చెందిన గుంటుకు బాలకృష్ణ ప్రైవేట్ ఆసుపత్రిలో రూ.47 లక్షల వరకు ఖర్చు కాగా సిఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంటే రూ.60వేలు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సిఎంఆర్‌ఎఫ్ నిధులను పెంచి దరఖాస్తు పెట్టుకున్న వారికి గరిష్ట మొత్తం మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజ మౌళి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, వర్గల్ మాజీ ఎంపిపి లతా రమేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, మర్కంటి కనకయ్య, గుంటుకు రాజు, రహీం, ఉపేందర్, కిరణ్‌గౌడ్, ఉమర్, అహ్మద్, అబ్దుల్, రాజు, కరీం పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న బిజెపి నూతన కార్యవర్గం

### బిజెపి అమీన్‌పూర్ మున్సిపాలిటీ డివిజన్

## కార్యవర్గ సభ్యులు నియామకం

**అమీన్‌పూర్, మే 17 ప్రభాతవార్త :** అమీన్‌పూర్ మున్సిపల్ డివిజన్ బిజెపి అనిల్‌చారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో శనివారం అమీన్ పూర్ మున్సిపాలిటీ డివిజన్‌కుగాను నూతన పార్టీ కార్యవర్గ సభ్యులను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్దెలి రవీందర్, ఎడ్ల రమేష్ హాజరయ్యారు. బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలు గోదావరి ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ సంరచనప్రభారీ, ఎన్నికల ఇంచార్జీ శ్రీబండారి శాంత కుమార్, సంరచన ప్రముఖ్ శ్రీనందారెడ్డి ఆమోద మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదెల్లి రవీందర్, ఎడ్ల రమేశ్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆగారెడ్డి సూచనలతో నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శులు(ఆ. సాయి శ్రావణ్, వై. రమేశ్ రెడ్డి), ఉపాధ్యక్షులు (ప్రభాకర్ ,సుమన్ కుమార్, కె. అనిల్ కుమార్ రమాదేవి), కార్యదర్శులు (రఘు, బి. అంజిలయ్య ఉష్శ్రీ, వి. సునీత) కోశాధికారి (రవి కిరణ్ రెడ్డి) యువమోర్చా అధ్యక్షుడు(బి. ఆకర్ష) యువమోర్చా ఉపాధ్యక్షుడు(ప్రశాంత్) ఓబీసీ మోర్చా అధ్యక్షుడు(ఎం. నందుకుమార్) ఓ.బి.సి మోర్చా ప్రధాన కార్యదర్శి(బంటు ప్రవీణ్)ఓ.బి.సి మోర్చా ఉపాధ్యక్షుడు(నగేష్) మహిళా మోర్చా అధ్యక్షురాలు (స్వప్న)మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు( సంధ్యారెడ్డి) కిసాన్ మోర్చా అధ్యక్షులు(డి. గోపాల్) మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి (స్వప్న) కిసాన్ మోర్చా అధ్యక్షులు (డి. గోపాల్) మహిళా మోర్చా కోశాధికారి(మాలిని) ఎస్సీ మోర్చా అధ్యక్షులు( ఏ. లక్ష్మణ్) ఎస్టి మోర్చా అధ్యక్షులు (జీవన్ పవర్) మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ( బుర్హాన్) మహిళా మోర్చా కార్యదర్శి (భారతి) చేనేత సెల్ (మహేందర్) లీగల్ సెల్ (పాండురంగారావు) ఐటీ సెల్ (కృష్ణారెడ్డి) ట్రేడ్ యూనియన్ సెల్ (చిరంజీవి) నియమించారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లో వస్తాయని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్దెలి రవీందర్, ఎడ్ల రమేష్ తెలిపారు.

## నల్లవల్లిలో భ్రమరాంబికా మల్లికార్జున జాతర



చిమ్ముల గోవర్ధన్‌రెడ్డిని జాతరకు ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

**గుమ్మడిదల మే 17(ప్రభాతవార్త) :** మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి వారి దేవాలయ వార్షికోత్సవం, జాతర మహోత్సవాలను ఈ నెల 17 (శనివారం) నుండి 20 (మంగళవారం) వరకు నల్లవల్లి దేవాలయ కమిటీ, ప్రజల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా ఆలయ నిర్వహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, బ్రమరాంబిక మల్లికార్జున స్వామి కృపతో నియోజకవర్గ ప్రజలు ఆనందంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, నల్లవల్లి దేవాలయ కమిటీ సభ్యులు రవీందర్, రాజుగౌడ్, హరిబాబు, అశోక్ గౌడ్, వెంకటేష్, ట్రస్ట్ సభ్యులు, సుధాకర్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్, కృష్ణ, పాల్గొన్నారు.

## గుమ్మడిదల నూతన ఎస్ఐగా భరత్‌భూషణ్

**గుమ్మడిదల మే 17 (ప్రభాతవార్త) :** గుమ్మడిదల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా భరత్ భూషణ్ శివారం రోజున బాధ్యతలు స్వీకరించారు. బీడీఎల్ భానూరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై గుమ్మడిదల పోలీస్ స్టేషన్ వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్యలు లేకుండా చూస్తామని ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇందుకు స్థానిక ప్రజలు నాయకులు ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు



శివంపేట సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

**చౌటకూరు, మే 17, ప్రభాతవార్త:** అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజు డిమాండ్ చేశారు. శనివరం చౌటకూరు మండలం శివంపేటలోని సొసైటీకార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తూకం వేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సొసైటీ అధికారులకు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు రైతులకు గోనె సంచులను అందించడంతో విఫలమవుతున్నారని, తూకం చేయక పోవడంతో కేంద్రం ఆవరణలోనే అకాల వర్షాలకు తడిసిపోయినట్లు చెప్పారు. వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినా అధికారులు రైతులకు టార్పాలిన్ కవర్లు అందించలేకపోయారని మండిపడ్డారు. తూకం చేసిన ధాన్యాన్ని సైతం అధికారులు రైసు మిల్లులకు పంపలేకపోయిరని విమర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. రైతులు చేస్తున్న ధర్నా ప్రాంతానికి తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులు చేరుకుని రెండు రోజుల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి సాయిలు, అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యా సాగర్, ఏరియా కమిటీ సభ్యులు నాగభూషణం, కృష్ణ, విఠల్, జైపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బిక్షపతి, రైతులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపూర్‌లో ముగిసిన ఉర్సు ఉత్సవాలు

**మునిపల్లి, మే 17 (పభాతవార్త):** మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌లో ఖమర్ హుసెన్ అలీషా దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరిగాయి. దర్గా పీఠాధిపతి అబ్దుల్ వాహెద్ ఖాద్రి అధ్వర్యంలో ఈ నెల 15న గ్రామం నుంచి దర్గా వరకు గందం, ఖవ్వాలి కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం సంగారెడ్డి, బిల్కల్ నుంచి దర్గా వరకు గంధం తీయుట శనివారం నాడు సమా ఖవ్వాలి తదితర కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. ఉర్సు ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారని ఆయన తెలిపారు.

## నేడు ఉర్సుయే షరీఫ్ జాతర ఉత్సవాలు



ఉర్సుయే షరీఫ్ జాతర గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సదాశివపేట, మే 17, ప్రభాతవార్త:** పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ప్రాంతంలో ఈ నెల 18న ఉర్సుయే షరీఫ్ 16వ జాతర ఉత్సవాలను పురస్కరించుకుని గోడపత్రికను నిర్వాహకులు రవియుద్దీన్ ఖాద్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రవియుద్దీన్‌ఖాద్రి మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు గంధం, దీపారాధన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. జాతర ఉత్సవాలకు చేరుకున్న భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. జాతర ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రఫీయుద్దీన్‌ఖాద్రి, ఎం తాజుద్దీన్ పేర్కొన్నారు.

## అకాల వర్షం.. అన్నదాత ఆగమాగం



అంబాజీపేటలోని కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

**చిన్నశంకరంపేట, మే 17, ప్రభాతవార్త:** ఆకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట ఆకాల వర్షాలకు తడిసిపోవడంతో తీవ్ర నష్టంకలుగుతుంది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను కాపడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లోని దాన్యం తడిసిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులతో పాటు తూకం వేసిన ధాన్యం కూడ తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతలు కోరుతున్నారు.

## ఆర్‌టిసి సిబ్బందికి అవార్డుల ప్రదానం

**జహీరాబాద్, మే 17, ప్రభాతవార్త:** జహీరాబాద్ ఆర్టీసి డిపోలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి శనివారం ప్రగతి చక్రం పురస్కారాల అవార్డులను డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ అందచేశారు. విధి నిర్వహణలో ప్రతిభ చాటినవారికి శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. పతిభచాటినవారిలో మొదటి బహుమతిగా రూ.800, రెండవ బహుమతిగా రూ. 600, మూడవ బహుమతిగా 400 రూపాయలను అందచేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజ్ ఇంచార్జి తిరుమలేష్, సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశాలమైన ప్రదేశంలో మోడల్ ఇళ్లు నిర్మించాలి



అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చిన్నకోడూరు, మే 17, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లును విశాలమైన ప్రదేశంలో జనాకర్షణ ప్రాంతంలో నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్‌యాదవ్ అధికారులను కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద కుటుంబానికి పక్కా ఇందిరమ్మ ఇల్లు అనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా మొదట అన్ని మండల కేంద్రాలలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ ఆదేశాలమేరకు మండల కాంగ్రెస్ బృందం అధికారులతో కలిసి ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మించే స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడివో జనార్ధన్, హౌజింగ్ డిఈ శంకర్, కాంగ్రెస్ నాయకులు పర్శరాం యాదవ్, రాజేష్, జయంత్, గణేష్, ప్రశాంత్, శేషు, శ్రీకాంత్, విజయ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీలో సాయికుమార్‌కు బంగారు పతకం

**కొండాపూర్, మే 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామస్తుడు పట్లోళ్ల హరిక భద్రయ్య కుమారుడు సాయికుమార్ మలేషియాలో జరిగిన కరాటే పోటీలో గోల్డ్‌మెడల్ సాధించాడు ఈ సందర్భంగా గ్రామస్తులు మలేషియా నుండి స్వదేశానికి వచ్చిన సాయికుమార్‌ను గ్రామస్తులు పెద్దఎత్తున ఘనస్వాగతంపలికి పూలదండ శాలువాతో సత్కరించారు. కరాటే పోటీలో గోల్డ్‌మెడల్ సాధించిన పట్లోళ్ల సాయికుమార్ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తంచేసి ఇటువంటి గోల్డ్ మెడల్ మరెన్నోసాదించాలన్నారు.

## అంబేద్కర్, గద్దర్ విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

**ములుగు, మే 17 (ప్రభాతవార్త):** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచిస్తే ఆ రాజ్యాంగంలో ఉన్న విధివిధానాలు అమలుపరిచే విధంగా పోరాటం చేసిన వ్యక్తి ప్రజా గాయకుడు గద్దర్ అని, వారిద్దరిది ఒకే సిద్ధాంత మని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల అన్నారు. శనివారం ములుగు మండలపరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ మామిడ్యాల గ్రామంలో అంబేద్కర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎడ్ల సత్తయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్, ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాల ఏర్పాటు కోసం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరుమహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన అంబేద్కర్ గ్రామ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డిబిఎఫ్ నాయకులు పి. శంకర్, ఎస్‌డిఎఫ్ శ్రీహరి యాదవ్, మాలమహానాడు నాయకులు తుమ్మ శ్రీనివాస్, నీరుడి స్వామి, హంస జిల్లా కన్వీనర్ బండారు దేవేందర్, నాయకులు కొడకండ్ల నర్సింలు, సత్తయ్యాచారి, తమ్మలి శ్రీనివాస్, మోహన్, ఎడ్ల పోచయ్య, అనిల్ కుమార్, రాచకొండ శ్రీకాంత్, ఆరె సత్తయ్య, వీరేశంగౌడ్ పాల్గొన్నారు.



అంబేద్కర్, గద్దర్‌ల విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

## అంగరంగవైభవంగా శివపార్వతుల కళ్యాణం

**పూడూరు, మే 17, ప్రభాతవార్త:**
పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామ శివాలయంలో శనివారం శ్రీశివపార్వతుల కళ్యాణం అంగరంగవైభవంగా జరిగింది. రెండు రోజుల కార్యక్రమాల్లోభాగంగా చివరిరోజు వేదపండితుల మంత్రోచ్చరణలు, బాజాభజంత్రీల మధ్య పార్వతీపరమేశ్వరుల కళ్యాణం కనులపండువగా సాగింది. ఉదయం 7గంటలనుండి స్వామివారి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈసందర్భంగా భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు, గుమ్మడి కాయలు కొడుతూ, దండలువేస్తూ స్వామివారికి స్వాగతం పలుకుతూ గ్రామంలోని వీధులన్ని కలియతిప్పారు. అనంతరం అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికళ్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధగ్రామాలనుండి భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం శ్రీమల్లికార్జున స్వామివారి బోనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాలకుచెందిన భజనమండలులుపాల్గొని శ్రీరాకంచెర్ల వెంకటదాసుల సంకీర్తనలు ఆలాపించారు. దీంతో గ్రామం అంతా శివనామస్మరణతో మార్మోగింది. ఉపాధ్యాయుడు బక్క రాజయ్య దంపతులు స్వామివారి కళ్యాణం జరిపించగా, కారూరి రవిగౌడ్ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## మీసేవా ఆపరేటర్ల నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం

**శామీర్‌పేట, మే 17, ప్రభాతవార్త**
తెలంగాణ మీసేవా ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్రనూతనకమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం శామీర్‌పేటలోని బృందావన్‌లో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో జరిగింది. తెలంగాణ మీసేవా ఆపరేటర్ల అసోసియేషన్ (టిఎంఎఒ) రాష్ట్రకమిటీ నూతన అధ్యక్షులుగా బత్తుల జీవన్‌ప్రసాద్ (బాలాపూర్-రంగారెడ్డి), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొత్త కిరణ్‌కుమార్‌లు ముందుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత కోశాధికారిగా గొట్టిపర్తి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా బుర్ర అశ్విన్‌గౌడ్, దాస జగదీశ్వర్, కె.లక్ష్మీనారాయణ, దాస్యపు రాజు, ఉపాధ్యక్షులుగా వి.భూమేశ్వర్, కోటేశ్వర్‌రావు, పనస చంద్రశేఖర్, జి.యాదగిరి, పి.శివకుమార్, నాకల నవీన్‌కుమార్, లీగల్ అడ్వయిజర్స్ టి.జయంతి, ఎం.ప్రజ్వల్‌రెడ్డి, టెక్నికల్ అడ్వయిజర్స్ ఎన్.బలవంతరావు, డి.రాజేశ్వర్, ఎం.మహేందర్, మీడియాకన్వీనర్ చిలుముల వేణు, కట్టుమల్ల సాగర్ బాబు, జాయింట్ సెక్రటరీలుగా ఎండి.అబ్దుల్‌గఫూర్, ఎండి నజీర్అహ్మద్, యు.సంతోష్, జి.పరిపూర్ణచారి, కె.అనిల్‌కుమార్, రఫిక్‌రహమాన్, బీర్ల సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎల్.సాయిశాంతాను, కె.సతీష్‌కుమార్, ఎన్.అనిల్‌కుమార్, కె.మహేశ్, ఎక్జిక్యూటీవ్ మెంబర్స్‌గా బి.గోపి, పి.గంగారెడ్డి, బి.శ్రీనివాస్, గంగిశెట్టి రత్నప్రసాద్‌లు ఎన్నికైనట్లు వ్యవస్థాపక అధ్యక్షులు పేర్కొన్నారు.

## కొత్తదనాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారు

**-డైరెక్టర్ నరసింహను అభినందించిన ఆచారి**


డైరెక్టర్ కలకొండ నరసింహను సన్మానించిన తల్లోజు ఆచారి

**ఆమనగల్లు, మే 17, ప్రభాతవార్త:**
కుటుంబ కథా నేపథ్యం ఉన్న "మన కుటుంబం' చిత్రం చాలా బాగుందని జాతీయ ఓబిసి కమీషన్ మాజీసభ్యుడు, బిజెపి రాష్ట్ర సీనియర్‌నాయకులు తల్లోజు ఆచారి కొనియాడారు. కల్వకుర్తి నియోజకవర్గం మాడ్గులమండలం కలకొండగ్రామానికి చెందిన నరసింహ దర్శకత్వం వహించి రూపొందించిన మనకుటుంబం చిత్రాన్ని శనివారం తల్లోజు ఆచారి పట్టణంలోని శ్రీవెంకటేశ్వర థియేటర్‌లో ముఖ్యఅతిథిగా విచ్చేసి తిలకించారు. తొలిసారి దర్శకత్వం వహించి తీసిన 'మన కుటుంబం' చిత్రం బాగుందని కితాబిచ్చారు. ఈసందర్భంగా డైరెక్టర్ నరసింహను పూలమాల, శాలువాతో ఆచారి సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తదనంతో రూపొందించే చిత్రాలను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు కండె హరిప్రసాద్, ఆమనగల్లు మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, ఆమనగల్లు బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి జగన్, ఆమనగంటి సంజీవ్‌కుమార్, కోట్ల వెంకటేశ్, పద్మప్రశాంత్, థియేటర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు..!

**-పంటలపై రైతులకు అవగాహన సదస్సు**


మేలురకపు వంగడాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

**నందిగామ, మే 17, ప్రభాతవార్త:**
నందిగామ మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఉన్న రైతు వేదిక సభలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతుముంగిట్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయపంటలలో పాటించవలసిన నూతన యాజమాన్య పద్ధతులను వివరించారు, డ్రోన్ సిస్టం ద్వారా పిచికారి చేసే విధానాన్ని వివరించడం జరిగింది. పచ్చిరొట్టలు, ఎరువుల ప్రాముఖ్యత గురించి వ్యవసాయ అధికారి పి.రామశివరావు తెలియజేశారు. వ్యవసాయశాస్త్రవేత్త డాక్టర్ భానుకిరణ్‌రెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులను, సమతుల్యత, వాడే పద్ధతులు, మట్టి పరీక్షలు, సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత, పంట మార్పిడివిధానం, విత్తనశుద్ధి, పురుగుమందుల వాడేవిధానం, అధునాతన యాజమాన్య పద్ధతులను, పర్యావరణపరిరక్షణ వంటి వాటిపై వివరించారు. కార్యక్రమంలో మేకగూడ పిఏసిఎస్ సింగిల్ విండో చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ మంజులరెడ్డి, రైతులు మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర రైతులకు తప్పని తిప్పలు ?

**-అందాలభామల పోటీలకు పెడతారా ఖర్చులు**
**-సాంస్కృతికశాఖ కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, తదితరులు

**కేశంపేట, మే 17, ప్రభాతవార్త:**
రైతులకష్టాలను గాలికొదిలేసి అందాలభామల పోటీలను నిర్వహించేందుకు డబ్బులు ఉన్నాయా అని ప్రశ్నించారు రంగారెడ్డి జిల్లా సాంస్కృతిక కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, అందాల పోటీలకు అంత ఖర్చుచేయడం అవసరమా అని డిమాండ్‌చేశారు. రైతాంగాన్ని పట్టించుకోకుండా అందాలపోటీలపై అంత ఆసక్తి చూపించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చమని మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తుచేస్తున్నాం అన్నారు. లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ధర్నాలను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు అల్లం ప్రతాప్‌రెడ్డి, తిరుపతి, కృష్ణ, జట్టూరి జయపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

# ప్రజలు మెచ్చిన ప్రభుత్వం రేవంత్ సర్కార్

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కేశంపేట, మే 17, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు మెచ్చిన ప్రభుత్వమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కేశంపేట మండలపరిధిలోని ఎక్లాస్‌ఖాన్ పేటగ్రామంలో 37, ఖైర్‌ఖాన్‌పల్లి గ్రామంలో 19 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులు గ్రామస్థులు కాంగ్రెస్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఎక్లాస్‌ఖాన్‌పేటలో పూలమాలలతో అడుగడుగున నీరాజనాలతో ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులతో గ్రామంలో ఎక్కడ చూసినా పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళల అండగా నిలుస్తానని అన్నారు. కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరంలేదని ఇందిరమ్మరాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచితగా ఆర్టీసీ ప్రయాణం, రూ. 500లకు సిలిండర్, ఉచితకరెంటు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం పంపిణీలతోపాటు అనేక సంక్షేమపథకాలు ప్రజలకు అందుబాటులోకితెచ్చామని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం, కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు రమేష్, కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి విశాలాశ్రమం రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదయ్య, శ్రవణ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, సీనియర్ నాయకులు సురేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, భాస్కర్‌గౌడ్, మండల బిసి సెల్ అధ్యక్షుడు రావుల పెంటయ్య ముదిరాజ్, గిరిధర్, గ్రూప్లనాయక్, తుమ్మల గోపాల్‌ముదిరాజ్, రాణి, ఇబ్రహీం, కోరుదురాములు, తైత పర్వతాలు, గ్యార సురేష్, రాజేందర్, అంజయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి పూజలు చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి


పెద్దమ్మతల్లి కల్యాణోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, మే 17, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ యంనంపేట్‌లో పెద్దమ్మ ఆలయంలో శనివారం అమ్మవారికి నిర్వహించిన కల్యాణోత్సవ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని పూజలుచేశారు. అమ్మవారికల్యాణోత్సవ వేడుకల్లోభాగంగా ఎమ్మెల్యేతోపాటు పలువురు బిఆర్‌ఎస్‌నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలుచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు తెలంగాణ ప్రజలపై ఉండాలని మొక్కినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదవితరణచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నర్రీధనలక్ష్మీకాశయ్య, బి.హరిప్రసాద్‌రావు, నాయకులు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, నల్లవెల్లి శేఖర్‌ముదిరాజ్, మంకం రవి, ఆర్.పద్మారావు ముదిరాజ్, బొక్కా బుచ్చిరెడ్డి, అశోక్‌ముదిరాజ్, భక్తులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలి

**-విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి**


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తదితరులు

**పూడూరు, మే 17, ప్రభాతవార్త:**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండలపరిధిలోని కెరవెల్లి గ్రామ ప్రధానకూడలిలో శుక్రవారంరాత్రి నూతనంగా ఏర్పాటుచేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచితవిద్యను అందించాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్‌ప్రభుత్వం నవోదయవంటి గురుకులాలను తెచ్చిందని వివరించారు. మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచదేశాల్లోని రాజ్యాంగాలను పరిశోధించిన అనంతరం కులమతాలకు అతీతంగా ప్రతి భారతీయ పౌరుడికి సమాన హక్కు కల్పించే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించి దేశ ప్రజలకు అందించిన ఘనత ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. దళిత కుటుంబంలో జన్మించిన అంబేద్కర్ పేద, ధనిక వర్గాలకు సమన్యాయం కోసం కృషిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో విగ్రహదాత కొల్లూరి భరత్, పిఎసిఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ ఎంపిపి మల్లేశం, సామాజికవేత్త రాజలింగం, డిసిసి ఉపాధ్యక్షులు కడుమూరు ఆనందం, మండల సమాచారహక్కు చట్టం కన్వీనర్ దేవనోనిగూడెం వెంకటయ్య, మాజీసర్పంచులు ఖరీం, బుచ్చన్నయాదవ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొజ్జ నర్సింలు, వివిధపార్టీల నాయకులు పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, మొగులయ్య, నారాయణ, భాస్కర్, అజీం పటేల్, ఎరాన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా, ముస్లిం సంఘం సభ్యులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## ఈనెల 19 నుండి బ్రహ్మంగారిచరిత్ర వీధినాటకం

**కొందుర్గు, మే 17, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని గాడిబావి కాలనీలో ఈనెల 19 నుండి 25వ తేదీ వరకు శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకం ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు కందికముల లక్ష్మయ్యగౌడ్, కటికం అంజయ్య, శేరిగూడెం రామస్వామిలు తెలిపారు. మండలపరిధిలోని వివిధగ్రామాలనుండి ప్రేక్షకులు, వేషధారణ వేసే అభిమానులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని వీధినాటకాన్ని తిలకించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సిఎంని కలిసిన రాష్ట్ర హజ్‌కమిటీ మెంబర్


సిఎంని కలిసిన రాష్ట్ర హజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్

**శామీర్‌పేట, మే 17, ప్రభాతవార్త:**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర హజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్(శామీర్‌పేట) హజ్‌యాత్ర సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. శామీర్‌పేటకు చెందిన రాష్ట్ర హజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ నగరంలోని హజ్ యాత్రికులకు స్వాగతం పలికే కార్యక్రమంలో పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర కమిటీ మెంబర్ ఎండి ముజీబ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర హజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హజ్‌యాత్రికుల కోసం పలుసౌకర్యాలు కల్పించిందని, హజ్‌యాత్రికులకు స్వాగతం పలకటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనటం సంతోషంగా ఉందని, మైనార్టీ (ముస్లిం) సోదరులను ఉత్సాహపరిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత దక్కుతుందని ఎండి ముజీబుద్దీన్‌పేర్కొన్నారు. ముస్లింలకు కాంగ్రెస్‌ప్రభుత్వం అండగా ఉంటుందని, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించటం జరుగుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర హజ్‌కమిటీ హజ్‌యాత్రికుల కోసం పలు సౌకర్యాలు కల్పించటం జరుగుతుందని ఎండి ముజీబుద్దీన్ పేర్కొన్నారు.

## సిసి రోడ్లపై నీటి కట్టలను తొలగించిన మున్సిపాలిటీ

**-'హలో షాద్‌నగర్' సోషల్‌మీడియా వార్తకు స్పందన**


సిసి రోడ్డుపై నీటి కట్టలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

**షాద్‌నగర్, మే 17, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప కాలనీలో పైభాగం నుండి వస్తున్న వర్షపునీరు అయ్యప్పకాలనీ కిందిభాగానికి రాకుండా సిసి రోడ్డుపై కాలనీవాసులు కొందరు నీటికట్టలను నిర్మించారు. దీనిపై ఆదర్శం అంటే ఇదేనా అధ్యక్షా అనే శీర్షికతో 'హలో షాద్‌నగర్' సోషల్ మీడియా గ్రూపులో వార్తను ప్రచురించారు. ఈవార్త వెలుగు చూడడంతో స్పందించిన మున్సిపల్ అధికారులు శనివారం ఉదయం అయ్యప్పకాలనీలో రోడ్డుపై అడ్డంగా నిర్మించిన నీటికట్టలను తొలగించారు. ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు కల్పిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. నీటికట్టలను ఏర్పాటుచేయడంవల్ల నీరునిలిచిపోయి మడుగులా మారింది. దీంతో ఇది దోమలకు, ఈగలకు ఆవాసాలుగా మారడడంతో కాలనీవాసులు మీడియాదృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి నీటికట్టలను తొలగించి నీటిని విడుదల చేయడం విశేషం. దీంతో కాలనీవాసులు మున్సిపాలిటీకి ధన్యవాదాలు తెలిపారు.

## నేడు ప్రాథమిక జీవిత సహాయ నైపుణ్యంపై శిక్షణ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:**
గచ్చిబౌలిలోని ఒలివా స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ సెంటర్‌లో జనతా హృదయాలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ప్రాథమిక జీవిత సహాయ నైపుణ్యం(సిపిఆర్ శిక్షణ) కార్యక్రమం ఆదివారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ మేథినిరెడ్డి శనివారం ఒప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేర్ హాస్పిటల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్రం, బిటిఆర్‌వోడబ్ల్యూఏ సహకారంతో దీన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. బిటిఆర్, రాంకి, విశాల్, కావూరి, ప్రజయ్, ల్యాండ్‌మార్క్ నివాసితులు ఈ శిక్షణకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటం

**-మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్**


సిపిఐ మహాసభలో మాట్లాడుతున్న జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, పాల్గొన్న నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 17, ప్రభాతవార్త:**
ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటాలు చేస్తుందని, ప్రజల పక్షాన నిలుస్తున్న పార్టీ సిపిఐ మాత్రమేనని మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా వినాయక్‌నగర్‌లోని నారెడ్డి గౌతంరెడ్డి కార్యాలయంలో మండల నాలుగవ సిపిఐ మహాసభ నారెడ్డి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. మహాసభల ప్రారంభానికి ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సిపిఐ మహాసభలో జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ మహాసభల ద్వారా సిపిఐ మరింత బలోపేతం కానున్నట్లు తెలిపారు. మే 25న ఉప్పల్ మండలంలోని ఇసిఐఎల్ పార్టీ కార్యాలయంలో జిల్లా సిపిఐ మహాసభలు జరుగనున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభలకు ఎమ్మెల్యే, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొననున్నట్లు, 400మంది పార్టీ ప్రతినిధులతో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ తెలిపారు. పార్టీ నాయకులు ప్రజల పక్షాన ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ మహాసభలో జిల్లానాయకులు నిమ్మల నర్సింహ్మా, డి.జంగయ్య, సోగడ రమేశ్, వి.వెంకటాచారి, ఎ.అశోక్, రాజయ్య, అంజనేయులు, పూర్ణచంద్, మహ్మద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఈపాస్ యాంత్రాల పంపిణీ



యంత్రాలను అందజేస్తున్న పిఏసిఎస్ అధ్యక్షులు శివకుమార్‌గుప్త

**కొడంగల్, మే 17, ప్రభాతవార్త:**
కొడంగల్ నియోజకవర్గంలోని ఎరువుల దుకాణాదారులకు ఈపాస్ యంత్రాలను పంపిణీ చేశారు. శనివారం మండలపరిధిలోని పర్సాపూర్ గ్రామంలోని రైతువేదికలో పిఏసిఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కోరమండల్ ప్రతినిధులు బిచ్చాల్ శ్రీకాంత్, రమేష్, వ్యవసాయశాఖ బొంరాస్‌పేట్, పర్సాపూర్ ఏఈఓలు కోరమండల్ వారు డిబిటి మెషీన్స్ అందజేశారు. ఆయా మండలాలకుచెందిన సుమారు 90మంది ఎరువుల దుకాణదారులకు ఈపాస్ యంత్రాలను అందజేశారు.

## పొలాలకు బాట చూపించి రైతులకు న్యాయంచేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

**పెద్దేముల్, మే 17, ప్రభాతవార్త:**
వ్యవసాయం సాగుచేసుకునేందుకు పొలాలకు బాట చూపించి రైతులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు నాగులపల్లిగ్రామ రైతులు విన్నవించారు. పెద్దేముల్ మండలం నాగులపల్లిగ్రామంలోని పానాది గుండా 20 మంది రైతులు పొలాలకు వెళ్ళి వ్యవసాయ పనులు చేసుకునేవారు. గ్రామానికి చెందిన కొడుగంటి రాములు, సాయిని నాగిరెడ్డి మధ్యన గత కొన్ని సంవత్సరాలుగా పానాది ఉంది. వీరి మధ్యనగల పానాది లావణి పట్టా కలదు. ఆపానాదిబాటను గ్రామానికిచెందిన కొడుగంటి రాములు జెసిబితో చదునుచేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బాట బంద్ చేస్తే ఎలా అని ప్రశ్నిస్తే, తమపై కేసులు పెడతామని బెదిరిస్తున్నాడని తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అందుకు తమ పొలాలకు వెళ్ళేందుకు బాట చూపించి తమకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు విజ్ఞప్తిచేశారు.

## భూమి ఉన్న రైతులు యూనిక్ నమోదు చేసుకోవాలి

**-ఏఈఓ ఇసాక్ హెరాల్డ్**


రైతుల యూనిక్ రిజిస్ట్రీ చేస్తున్న ఏఈఓ

**కొడంగల్, మే 17, ప్రభాతవార్త:**
భూమి ఉన్న రైతులందరూ యూనిక్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఏఈఓ ఇసాక్ హెరాల్డ్ అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. భూమి ఉన్న రైతులు తమపేర్లను నమోదు చేసుకుంటే ఆధార్ తరహాలో యూనిక్‌నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమపథకాలు పొందడం సులభతరం అవుతుందన్నారు. రైతువేదిక, కొడంగల్ వ్యవసాయకార్యాలయంలో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

## ఎసిపికి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకుడు


ఎసిపికి బొకే అందజేస్తున్న నాయకులు

**శంషాబాద్, మే 17, ప్రభాతవార్త:**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ సబ్ డివిజన్ ఏసిపిగా నియమితులైన శ్రీకాంత్‌గౌడ్‌ను శంషాబాద్ భారతీయ జనతా పార్టీ నాయకుడు కొండా పరమేష్‌గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు తాము ఎప్పుడూ సహకరిస్తామని హామీనిచ్చారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌గౌడ్‌ను శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో పెదిరిపాటి శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## హామీల అమలులో ముఖ్యమంత్రి విఫలం

**-బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్**


మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్

**ఆమనగల్లు, మే 17, ప్రభాతవార్త:**
ఎన్నికల ముందు ఆమనగల్లు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలంచెందిందని బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో పార్టీశ్రేణులతోకలిసి పత్యానాయక్ స్థానికవిలేకరులతో మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల ముందు సిఎం రేవంత్‌రెడ్డి ఆమనగల్లు అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చి సుదీర్ఘసమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పత్యానాయక్ గుర్తుచేశారు. ఇచ్చిన హామీలు ఇప్పుడు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క వర్గంప్రజలు సంతోషంగా లేరని విమర్శించారు. రుణమాఫీ, రైతుబంధు అందని రైతులకు న్యాయంచేసిన తరువాతే ముఖ్యమంత్రి ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో సోన శ్రీనునాయక్, సరితపంతునాయక్, మాజీ వార్డుసభ్యులు వస్పుల సాయిలు, పంతునాయక్, గణేశ్‌నాయక్, మల్యానాయక్, లండం యాదయ్య, వరికుప్పల గణేశ్, నాగిళ్ళ జగన్, పంతునాయక్, మల్లేశ్, మహేశ్, శ్రీకాంత్‌నాయక్, మణిపాల్‌నాయక్, రేవల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.